సాక్షి కామారెడ్డి

సోమవారం । 28 । ఏప్రిల్ । 2025



ప్రధాన కాలువకు మరమ్మతులు

పోచారం ప్రధాన కాలువ మరమ్మతులకు ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షాకాలంలోగా పూర్త య్యేలా ప్రణాళికలు రూపొందించారు.

- 9లో ▸



రోడ్డుపైనే విక్రయాలు

ఎల్లారెడ్డి పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు విక్రయిస్తుండడంతో వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
42.9 /23.5

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పీఎం మన్‌కీ బాత్ వీక్షించిన బీజేపీ నాయకులు



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని 12వ వార్డులో ఆదివారం ప్రధాన మంత్రి మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు టీవీలో వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, పట్టణ ఉపాధ్యక్షుడు రజినీకాంత్ రావు, 12 వార్డు బూత్ అధ్యక్షుడు గోపాల్, రామకృష్ణ, బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు తుమ్మ బాలకిషన్, నాయకులు రవీందర్, గోవర్ధన్, దొడ్ల స్వామి, రజినీకాంత్, ప్రభాకర్, శ్రీకాంత్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

4న వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో మే 4 నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రికెట్ శిబిరం నిర్వహించనున్నారు. హైదరాబాద్, నిజామాబాద్ క్రికెట్ అసోసియేషన్‌ల సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మోజామ్ అలీఖాన్, ముప్పారపు ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. 13 నుంచి 23 ఏళ్లలోపువారు అర్హులని తెలిపారు. క్రీడాకారులు తెల్లని క్రికెట్ దుస్తులు, క్యాన్వస్ షూస్, క్రికెట్ కిట్ వెంట తీసుకొని రావాలని, వివరాలకు 96666 77786లో సంప్రదించాలని సూచించారు.

చిన్నారిని బలిగొన్న కూలర్



విహంకిత (ఫైల్)

మాక్లూర్ : కూలర్ షాక్‌తో చిన్నారి మృతి చెందిన ఘటన చిక్లిలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిక్లికి చెందిన గడ్డం అర్చన, నవీన్ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఉన్న అసెంబుల్డ్ ఐరన్ కూలర్ వద్ద తల్లిదండ్రులతోపాటు పెద్దకూతురు విహంకిత(5) నిద్రపోయింది. సుమారు 2 గంటల సమయంలో నిద్ర నుంచి మేల్కొన్న విహంకిత అకస్మాత్తుగా పక్కనే ఉన్న కూలర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురైంది. దీంతో ఇంటి దర్వాజ నుంచి వాకిట్లో పడిపోయింది. ఇంటి ఎదుట రహదారి గుండా వెళ్లేవారు గమనించి తల్లిదండ్రులకు తెలపడంతో విహంకితను వెంటనే జన్నేపల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యుడు నిర్ధారించారు. అప్పటి వరకు తమతో ఆడుతూ పాడుతూ గడిపిన కూతురు మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపించారు.

ట్రామా.. డ్రామాయేనా?

జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలు..

సంవత్సరం	ప్రమాదాలు	మరణాలు	క్షతగాత్రులు
2022	501	230	271
2023	513	258	255
2024	526	221	289
2025 (మార్చి వరకు)	119	049	067

జిల్లాలో నిత్యం ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదం జరుగుతూనే ఉంది. అయితే వారికి అత్యవసర వైద్యం అందించడానికి జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన ట్రామా కేర్ సెంటర్‌లో వైద్యులు లేక సేవలు అందడం లేదు. దీంతో ఇతర ఆస్పత్రులకు తరలించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో కొందరు మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. ట్రామాకేర్ సెంటర్‌ను వినియోగంలోకి తీసుకురావాల్సిన అధికారులు.. దానిని ఆర్థోపెడిక్ వార్డుగా వినియోగిస్తుండడం గమనార్హం.



ఆర్థోపెడిక్ వార్డుగా వినియోగిస్తున్న ట్రామాకేర్ సెంటర్

- జిల్లా కేంద్రంలో 16 ఏళ్ల క్రితం ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు
- ఇప్పటికీ వైద్యులు, సిబ్బంది భర్తీ ఊసే లేదు
- ప్రమాద బాధితులకు అందని అత్యవసర వైద్యం
- ప్రాణాలు కోల్పోతున్న క్షతగాత్రులు



ఆస్పత్రి ఆవరణలో తుప్పపట్టి పడి ఉన్న ట్రామాకేర్ అంబులెన్స్



మైనర్ ఓటీగా వినియోగిస్తున్న ట్రామాకేర్ థియేటర్

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలో 2009లో ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అప్పట్లో ఏరియా ఆస్పత్రిగా ఉన్న భవనంలో ట్రామాకేర్ సెంటర్‌ను ప్రారంభించారు. రూ. 4.50 కోట్ల నిధులతో అదనపు భవనం నిర్మించారు. ట్రామాకేర్ సెంటర్‌లో ఆర్థోపెడిక్, అనస్తీషియా, సర్జన్, న్యూరాలాజిస్టు, రేడియాలజిస్ట్ పోస్టులతో పాటు స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎం, సిబ్బందిని నియమిస్తామని పాలకులు ప్రకటించారు. ప్రత్యేక ఆపరేషన్ థియేటర్‌తో పాటు సిటి స్కాన్, సీయామ్, ఈసీజీ, ఎక్స్‌రే తదితర అధునాతన యంత్రాలతో వైద్యసేవలు ప్రారంభిస్తామని వైద్యశాఖ పేర్కొంది. కానీ ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించలేదు. వైద్య పరికరాల ఊసే లేదు. 2010లో రూ. 40 లక్షలతో కొనుగోలు చేసిన అధునాతన అంబులెన్స్‌ను వినియోగించక పోవడంవల్ల ఆ వాహనం పూర్తిగా తుప్పుపట్టిపోయింది. 2016 ఏప్రిల్ 3న రూ. 63 లక్షలతో ఏర్పాటు చేసిన ఆపరేషన్ థియేటర్‌ను, ట్రామాకేర్ సెంటర్‌ను అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి చేతుల మీదుగా పునఃప్రారంభించారు. అయితే వైద్యులు, సిబ్బంది నియమించకపోవడంతో నిరుపయోగంగా ఉంది. ప్రస్తుతం జీజీహెచ్‌లోని ట్రామాకేర్ సెంటర్‌ను ఆర్థోపెడిక్ వార్డుగా, ఆపరేషన్ థియేటర్‌ను మైనర్ ఓటీగా మార్చి వినియోగిస్తున్నారు. మధ్యలో కొంత కాలం పాటు ఆ ఆపరేషన్ థియేటర్‌ను ఎస్ఎన్‌సీయూగానూ వినియోగించారు.

గాలిలో కలుస్తున్న ప్రాణాలు..

జిల్లాలో బస్వాపూర్ నుంచి దగ్గి వరకు ఉన్న జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదాలలో ఏడాది కాలంలో 70 మంది చనిపోయారు. సంగారెడ్డి–నాందేడ్–అకోలా రహదారిపై జరిగిన ప్రమాదాల్లో 22 మంది ప్రాణాలుకోల్పోయారు. హైదరాబాద్–మెదక్–బోధన్ రహదారిపై జరిగిన ప్రమాదాల్లో 36 మంది మరణించారు. అలాగే రాష్ట్ర, జిల్లా, గ్రామీణ రహదారులపై గతేడాది 195 మంది మృత్యువాతపడ్డారు. ప్రమాద బాధితులను జిల్లా కేంద్రంలోని ఆస్పతికి తరలిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ట్రామాకేర్ సేవలు అందక అత్యవసర పరిస్థితిలో క్షతగ్రాతులను మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు తరలించాల్సి వస్తోంది.

ఈ క్రమంలో సకాలంలో వైద్య సేవలు అందక కొందరు మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని ట్రామా కేర్ సెంటర్‌లో వైద్యు లు, సిబ్బందిని నియమించేలా చూడాలని ప్రజ లు కోరుతున్నారు.

బడులకు భద్రత కరువు



ప్రహరీ లేని గోపాల్‌పేట హైస్కూల్ భవనం

- ప్రారంభమైన వేసవి సెలవులు
- వాచ్‌మన్‌లు లేక ఇబ్బందులు

నాగిరెడ్డిపేట: పాఠశాలలకు ఈనెల 24 నుంచి వేసవి సెలవులు ప్రారంభమయ్యాయి. దీంతో సెలవులు పూర్తయ్యేవరకు పాఠశాలలవైపు కన్నెత్తి చూసేవారు ఉండరు. ఇదే అదనుగా భావించే ఆకతాయిలు పాఠశాలల భవనాలను అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మార్చుకునే అవకాశాలుంటాయి. దీంతోపాటు గతంలో జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సెలవుల్లో చోరీలు జరిగిన సంఘటనలూ ఉన్నాయి.

జిల్లాలో 710 ప్రాథమిక, 212 ప్రాథమికోన్నత, 322 ఉన్నత పాఠశాలలున్నాయి. ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా జిల్లాలోని చాలా పాఠశాలలకు డిజిటల్ బోర్డులు, కంప్యూటర్లు, డెస్కుబెంచీలతో పాటు తాగునీటి సరఫరాకు సంబంధించి ఆర్‌వో ప్లాంట్లను సరఫరా చేశారు. పీఎంశ్రీ పథకం ద్వారా కొన్ని పాఠశాలలకు కంప్యూటర్లు, ట్యాబ్‌లను అందజేశారు. దీంతోపాటు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన సరుకులున్నాయి. చాలా పాఠశాలల భవనాల చుట్టూ ప్రహరీలు లేవు. కొన్ని పాఠశాలల భవనాల చుట్టూ ప్రహరీలున్నా అవి పూర్తిస్థాయిలో లేవు. మరికొన్ని పాఠశాలల భవనాలకు సరైన గేట్లు కూడా లేవు. ప్రస్తుతం వేసవి సెలవులు ఇవ్వడంతో పాఠశాలలకు భద్రత కరువయ్యింది. వేసవి సెలవులు ముగిసేవరకు కాపలా కోసం తాత్కాలికంగా వాచ్‌మన్లను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.



ఒకవైపు ప్రహరీ లేకుండా ఉన్న తాండూర్ హైస్కూల్

‘ఉద్యోగ భద్రత కల్పించాలి’

భిక్కనూరు: యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్టు అధ్యాపకుల రాష్ట్ర అ సోసియేషన్ ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా డిమాండ్ చేశారు. భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం తొమ్మిదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా నారాయణ గుప్తా మాట్లాడుతూ సమన్యాయం, సమానత్వం కలిగిన సమాజం కోసం పనిచేస్తామన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మాటలను నిజం చేయడానికి యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నిరసన దీక్షలో కాంట్రాక్టు అధ్యాపకులు యాలాద్రి, సునీత, నరసయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సౌత్‌క్యాంపస్‌లో నిరసన దీక్షలో కూర్చున్న కాంట్రాక్టు అధ్యాపకులు

కూరగాయలు C/o అంకోల్ క్యాంప్

- అంగళ్లకు ఇక్కడి నుంచే సరఫరా
- లాభాలు గడిస్తున్న రైతులు



పందిరి సాగు విధానంలో పండిస్తున్న సోరకాయ

నస్రుల్లాబాద్ : సాధారణంగా ఏ గ్రామంలో అయినా కొద్దిమంది మాత్రమే కూరగాయలు సాగు చేస్తుంటారు. కానీ అంకోల్ క్యాంప్‌లో మాత్రం ఊరు ఊరంతా కూరగాయలు సాగు చేస్తుంది. అది కూడా సేంద్రియ ఎరువులు వాడుతూ కూరగాయలు పండిస్తున్నారు. వీరు పండించిన కూరగాయలను బాన్సువాడ, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, పిట్లం, బిచ్కుంద, నిజామాబాద్, బోధన్, కోటగిరి, సాలూర, సాటాపూర్, నవీపేట్, పొతంగల్, వర్ని, నారాయణ్‌ఖేడ్ తదితర ప్రాంతాల్లోని అంగళ్లకు తీసుకువెళ్లి విక్రయిస్తుంటారు.

అంకోల్ క్యాంప్‌లో మొత్తం 105 కుటుంబాలున్నాయి. సుమారు 60 కుటుంబాలు కూరగాయలను సాగు చేస్తున్నాయి. సాధారణ పంటలతోపాటు దాదాపు 45 ఎకరాల్లో ఆయా రకాల కూరగాయలు పండిస్తున్నారు. బెండకాయ, క్యాబేజీ, మిర్చి, వంకాయ, టమాట, క్యాలీఫ్లవర్, సోరకాయ, బీరకాయ, కాకరకాయలు ఎక్కువగా పండిస్తారు. రోజూ కూరగాయలు తెంపి, చుట్టు పక్కల గ్రామాల్లో నిర్వహించే అంగళ్లకు తీసుకువెళ్లి విక్రయిస్తారు.



✤ ఈమె పేరు చంద్రమ్మ. 73 ఏళ్లు. తనకున్న 1.05 గుంటల భూమిలో వరితోపాటు ఉల్లిగడ్డ, పాలకూర, టమాట, తోటకూర, మెంతికూర, కొత్తిమీర సాగుచేస్తోంది. తానే స్వయంగా పొలంలో పనులు చేస్తుంది. ఇద్దరు కూతుళ్లతోపాటు కొడుకు పెళ్లి చేసింది. కొడుకు హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటుండగా, ఇద్దరు మనవళ్లతో పొలం పనులు చూసుకుంటూ ఆదర్శంగా నిలుస్తోంది.

అతివలదే ప్రధాన పాత్ర..

కూరగాయల సాగులో మహిళలే క్రియాశీలక పాత్ర పోషిస్తుంటారు. విత్తనాలు విత్తడం, నీరు పెట్టడం, కలుపు తీయడం, ఎరువులు వేయడం, పంట కోయడం వంటి పనులన్నీ మహిళలే చేస్తారు. ఉదయం పంట కోసి బుట్టలు సిద్ధంగా ఉంచితే మగవారు వాటిని తీసుకెళ్లి అమ్ముకొని వస్తారు. కొందరు మహిళలు సైతం మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు విక్రయిస్తుంటారు.

అన్నీ నేనే చేస్తా..



అర ఎకరం భూమిలో కూరగాయలు పండిస్తాం. మిగతాది వరి పండిస్తాం. పంట కోయడం, కలుపు తీయడం, నీరు పారించడం, మందులు చల్లడం వంటివి నేనే చేసుకుంటాను. మా ఆయనకు చేదోడు వాదోడుగా ఉంటాను.

– శోభ, రైతు, అంకోల్ క్యాంపు

మా కూరగాయల కోసం ఎదురుచూస్తారు



మా ఊరి పంట బండ్ల కోసం ప్రజలు ఎదురు చూస్తారు. చుట్టు పక్కల ఎక్కడ అంగడి ఉన్నా మా గ్రామం నుంచే కూరగాయలు పంపిస్తాం. శుభకార్యాలకు ప్రత్యేకంగా వచ్చి తీసుకెళతారు.

– సిద్దమ్మ, రైతు, అంకోల్ క్యాంపు

రెండెకరాల్లో కూరగాయలు పండిస్తున్నా



ఉదయం నిద్ర లేచింది మొదలు సాయంత్రం వరకు పొలంలోనే ఉంటా. కూరగాయలు మార్కెట్ వెళ్లగానే తినేసి వచ్చి పనులు చేసుకుంటాం. 2 ఎకరాల్లో వివిధ రకాల కూరగాయలు పండిస్తాం.

– లక్ష్మి, రైతు, అంకోల్ క్యాంపు

సంతోషంగా ఉంది



మా ఊరి రైతులు కూరగాయలే కాకుండా వరి పండించడంలోనూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కూరగాయల సాగు పనులన్నీ మహిళలే చూస్తారు. కూరగాయల సాగుతో మా ఊరి రైతులు లాభాలు గడిస్తున్నందుకు సంతోషంగా ఉంది.

–వెంకటరమణ, మాజీ సర్పంచ్, అంకోల్ క్యాంపు

‘దయానందుడు చూపిన మార్గం ఆచరణీయం’



ప్రత్యేక సంచిక ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్

కామారెడ్డి అర్బన్ : ఆర్య సమాజ స్థాపకులు మహర్షి దయానంద సరస్వతి చూపిన మార్గం ఎంతో ఆచరణీయమైందని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. కామారెడ్డి ఆర్య సమాజం స్వర్ణోత్సవాలను ఆదివారం జిల్లాకేంద్రంలోని శ్రీసరస్వతి విద్యామందిర్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించారు. 108 కుండాలతో గాయత్రి మహా యాగం జరిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా స్వర్ణోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కామారెడ్డి ఆర్యసమాజం 50 ఏళ్లుగా వేద ధర్మాన్ని ప్రచారం చేస్తూ సమాజ ఉద్ధరణకు పాటుపడుతుండడం అభినందనీయమన్నారు. ఆర్యసమాజం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆర్యసమాజం బాధ్యతలను యువతకు అప్పగించాలని సూచించారు. ఆర్ష గురుకులం అధిపతి బ్రహ్మానంద సరస్వతి, కోల్‌కతాకు చెందిన మహేంద్రపాల్ ఆర్య మాట్లాడుతూ ప్రతిఒక్కరు దేశభక్తి కలిగి ఉండాలని, వేదమార్గంలో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్యప్రతినిధి సభ కార్యదర్శి హరికిషన్ వేదాలంకార్, కామారెడ్డి ఆర్యసమాజం అధ్యక్షుడు కంకణాల కిషన్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే నేరెళ్ల ఆంజనేయులు, ఆర్యసమాజం ప్రతినిధులు గరిపల్లి అంజయ్యగుప్తా, గడ్డం రాంరెడ్డి, అర్వపల్లి రమేష్, నందనం కృపాకర్, ఆచార్య సత్యవీర్, దోమకొండ అరుణ, వంగాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాహుబలి దివ్యవాణి గ్రంథం..

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్యసమాజం స్వర్ణోత్సవాలను ఆదివారం జిల్లాకేంద్రంలోని సరస్వతి విద్యామందిర్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తకాల స్టాళ్లు ఏర్పాటు చేశారు. రంగారెడ్డి జిల్లా తూంపల్లికి చెందిన మర్రి కృష్ణారెడ్డి ఏర్పాటు చేసిన స్టాల్ అందరినీ ఆకర్షించింది. ప్రపంచంలోనే అతిపెద్ద గ్రంథం దివ్యవాణి నాలుగు వేదాల గ్రంథాన్ని ప్రదర్శించారు. 24 కిలోల బరువున్న వేదాల గ్రంథం వెల రూ. 24వేలని మర్రి కృష్ణారెడ్డి తెలిపారు. 4 వేల పేజీలతో 15/20 సైజులో ఈ గ్రంథం ఉంది. నాలుగు వేదాలను సులభమైన భాషలో అనువదించినట్లు మర్రి కృష్ణారెడ్డి తెలిపారు.



దివ్యవాణి గ్రంథాలతో ప్రచురణకర్త మర్రి కృష్ణారెడ్డి

తల్లిదండ్రులకు ‘పరీక్షే’!



డివైడర్‌పై కూర్చున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మోడల్ స్కూల్‌లో ప్రవేశం కోసం ఆదివారం పరీక్ష నిర్వహించారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రం వద్ద అధికారులు కనీస వసతులు కూడా కల్పించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు. నీడ సౌకర్యం లేకపోవడంతో 44వ జాతీయ రహదారి పక్కన, డివైడర్‌పై కూర్చొని నిరీక్షించాల్సి వచ్చింది.

– సదాశివనగర్

తైబజార్ కాంట్రాక్టర్‌పై రైతుల ఆగ్రహం

భిక్కనూరు: మండల కేంద్రంలో తైబజార్ కాంట్రాక్టర్‌పై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రైతులు కూరగాయలను తీసుకుని భిక్కనూరు అంగడికి వచ్చారు. తైబజార్ కాంట్రాక్టర్ ఒక గంపకు రూ.50 ఇవ్వాలని డిమాండ్ చేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కువ మొత్తం పాడి తైబజార్ సొంతం చేసుకున్నానని, గంపకు రూ. 50 తీసుకుంటేనే గిట్టుబాటు అవుతుందని కాంట్రాక్టర్ చెప్పాడు. ఈ క్రమంలో కాంట్రాక్టర్‌తో రైతులు వాగ్వాదానికి దిగారు. గ్రామపంచాయతీ ఈవో మహేష్‌గౌడ్ అంగడికి వచ్చి విషయం తెలుసుకున్నారు. గంపకు రూ. 15 మాత్రమే తీసుకోవాలని, ఎక్కువ డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

క్లుప్తంగా

'జయంత్యోత్సవాలకు తరలిరావాలి'



బోధన్: పట్టణంలో ఈనెల 30న అంబేడ్కర్, జ్యోతిబాపూలే, జగ్జీవన్‌రాం జయంతిని పురస్కరించుకుని నిర్వహించనున్న మహనీయుల జయంత్యోత్సవ సభ, ర్యాలీకి ప్రజలు తరలిరావాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర ప్రతినిధి పరిమి కోటేశ్వర్‌రావు కోరారు. బోధన్‌లోని తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో ఆదివారం డివిజన్ కమిటీ ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా వేలాది మందితో ర్యాలీ నిర్వహించనున్నామని, సభను అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. కమిటీ కన్వీనర్ నీరడి ఈశ్వర్, ప్రతినిధులు రవి కుమార్, వెంకటి, సింగాడి పాండు, సూర్యకాంత్, దేవేందర్, కారం స్వామి, రాహుల్, సురేందర్ పాల్గొన్నారు.

ఐకమత్యంతో ముందుకు సాగాలి



నిజామాబాద్ రూరల్: బ్రాహ్మణులు ఐకమత్యంతో ముందుకు సాగాలని రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య శాశ్వత చైర్మన్ వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ పేర్కొన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో బ్రాహ్మణులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం జిల్లా కేంద్రంలోని అర్సపల్లి పురుషోత్తం గుప్త కల్యాణ మండపంలో నిర్వహించారు. రాష్ట్రంలో పరిషత్ ద్వారా వచ్చే నిధులు త్వరలోనే విడుదలవుతాయని తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోత్కూరి రామేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న పేద బ్రాహ్మణులకు, పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించేలా కృషి చేస్తామన్నారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర శాశ్వత చైర్మన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉమాకాంత్, డాక్టర్ చంద్రశేఖర్ బిర్లా రామారావు, భూపతిరావు, ప్రవీణ్ కులకర్ణి, గాయత్రి కులకర్ణి, శరత్ కుమార్, వైద్య రణధీర్, ప్రవీణ్ మహరాజ్, రాజగోపాల చారి, రామ్ శ్యామ్, నవీన్, విజయ్, సభ్యులు పాల్గొన్నారు.

నేత్ర, శరీర అవయవ దాతల సంఘం కన్వీనర్‌గా ప్రేమ్‌లాల్



నిజామాబాద్ రూరల్: తెలంగాణ నేత్ర శరీర అవయవ దాతల సంఘం నిజామాబాద్ సిటీ కన్వీనర్‌గా బానోత్ ప్రేమ్‌లాల్ నియామకం అయ్యారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కామిడి సతీశ్‌రెడ్డి ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు.

నిధులు సరిపోక నిలిచిన పనులు

- బోధన్ శివారులోని పసుపువాగుపై ఏడాది క్రితం వంతెన పనులు ప్రారంభం
- రూ.3కోట్ల నిధులు సరిపోక అర్ధంతరంగా నిలిచిన బ్రిడ్జి నిర్మాణం





బోధన్ శివారులోని పసుపు వాగుపై అర్ధంతరంగా నిలిచిన వంతెన నిర్మాణం

బోధన్: బోధన్ పట్టణ శివారులోని బోధన్–బాన్సువాడ బైపాస్ రోడ్డు సమీపంలో గల పసుపు వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. పనులకు కేటాయించిన నిధులు సరిపోక, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీన వైఖరి ఇలా అనేక కారణాల వల్ల పనులు అర్ధాంతరంగా నిలిచిపోయి, ముందుకు సాగడం లేదు. కాలయాపన వల్ల పనుల అంచనా వ్యయం పెరిగిపోతోంది. మరో వైపు అదనపు నిధుల కోసం పంపిన ప్రతిపాదనలు మేరకు నిధుల మంజూరులో అలస్యం జరుగుతోంది. అయినా పాలకులు, అధికారులు స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

ఐదేళ్ల క్రితం ప్రతిపాదనలు..

పసుపు వాగుపై వంతెన నిర్మాణం కోసం 2021–22 ఆర్థిక సంవత్సరంలో పీఎంజీఎస్‌వై (ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన) కింద రూ. 3కోట్ల నిధులు మంజూరయ్యాయి. పీఆర్ ఇంజినీరింగ్ శాఖ పనుల కోసం టెండర్లు నిర్వహించగా 2023లో ప్రక్రియ పూర్తి చేసి కాంట్రాక్టర్‌కు అప్పగించారు. 2023 సెప్టెంబర్‌లో పనులు ప్రారంభించి 2025 మార్చి 1వరకు పూర్తి చేయాలని గడువు విధించారు. కానీ గడువు ముగిసిపోయిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. 10 పిల్లర్లు నిర్మించగా, రెండు పిల్లర్ల మేర స్లాబ్ వేసి వదిలేశారు. ఐదేళ్ల క్రితం ప్రతిపాదనల మేరకు మంజూరైన నిధులతో పనులు పూర్తి చేశామని, మరో రూ.3 కోట్లు నిధులు మంజూరుకు ఏడాదిక్రితమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు అధికారులు చెబుతున్నారు. నిధులు ఎప్పుడు మంజూరవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

బోధన్–కోటగిరి మండలాలకు అనుసంధానం

బోధన్ పట్టణ శివారు నుంచి పసుపు వాగు వంతెన మీదుగా కోటగిరి మండలంలోని ఎత్తొండ, రాయ్‌కూర్, దోమలెడ్గి వరకు సుమారు 14 కిలో మీటర్ల పొడువున పీఎంజీఎస్‌వై కింద రూ.6 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టి రెండేళ్ల క్రితమే పూర్తిచేశారు. వాగుపై చేపట్టిన వంతెన నిర్మాణం పూర్తి చేస్తే కోటగిరి మండల ప్రజలకు పట్టణ కేంద్రానికి వచ్చేందుకు దూరం తగ్గడమే కాక మరింత సౌకర్యంగా మారనుంది. ప్రస్తుతం వాగులో తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డు మీదుగా రెండు మండలాల ప్రజలు రాకపోకలు సాగుతున్నాయి. అలాగే పసుపు వాగు అవతలి ఒడ్డున పట్టణ రైతులకు సంబంధించి 250 ఎకరాలకు పైగా సాగు భూములున్నాయి. వర్షాకాలంలో పంట పొలాలకు వెళ్లేందుకు ఏళ్లుగా రైతులు తీవ్ర కష్టాలు పడుతున్నారు. వంతెన పూర్తయితే సాగు కష్టాలు తీరుతాయని సంబుర పడ్డారు. కానీ పనులు ముందుకు సాగకపోవడంతో రైతులు, ఇరు మండలాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి, పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి



పసుపు వాగు అంచున నా పొలాలున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న వంతెన నిర్మిస్తామంటే కాంట్రాక్టరుకు నా సొంత సాగు భూమిని ఇసుక, కంకర, ఇతర సామగ్రి నిల్వ కోసం కౌలు ధరకు ఇచ్చాను. ఏడాదిన్నర కావస్తున్న పనులు ముందుకు సాగడం లేదు. సామగ్రి పంట పొలంలోనే మిగిలిపోయి ఉంది. ఈ ఏడాదికి సంబంధించి రావాల్సిన కౌలు డబ్బులు రూ.లక్షా 35 వేలు కాంట్రాక్టరు చెల్లించడం లేదు. వంతెన పనులు త్వరితగతిన పూర్తి చేస్తే రైతులకు మేలు జరుగుతోంది.

– బుర్క చిన్న లింగాగౌడ్, రైతు, పాన్‌గల్లీ, బోధన్

ప్రతిపాదనలు పంపించాం..

పసుపు వాగుపై చేపట్టిన వంతెన పనులు పూర్తికి మరో రూ.3 కోట్లు మంజూరుకు రివైజ్డ్ ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించాం. గతంలో మంజూరైన నిధుల మేరకు పనులు పూర్తి చేశాం. నిధులు సరిపోకనే పనులు నిలిచాయి. వంతెన స్లాబ్, సైడ్‌వాల్స్, ఇరువైపులా అప్రోచ్ బీటీ రోడ్డు నిర్మాణం పనులు మిగిలిపోయాయి. నిధులు రాగానే పనులు చేపట్టి పూర్తి చేస్తాం.

– పవన్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఏఈ, బోధన్

యూనిఫాం కుట్టు కూలి చెల్లించేదెప్పుడో?



విద్యార్థులకు కొలతలు తీసుకుంటున్న టైలర్లు

- జిల్లాలో పాత బకాయి రూ.45 లక్షలు
- పాత బకాయిలు చెల్లిస్తేనే కొత్త దుస్తులు కుడుతామంటున్న మహిళా సంఘాల సభ్యులు
- జిల్లాలో 94,333 విద్యార్థులు

బిచ్కుంద(జుక్కల్): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా యూనిఫాం అందిస్తోంది. గతేడాది యూనిఫాం కుట్టు చార్జీలు ప్రభుత్వం కొన్ని చెల్లించింది. సుమారు రూ.45 లక్షలు మహిళా సంఘాలకు చెల్లించాల్సి ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అందించిన యూనిఫాంలు కొందరు విద్యార్థులకు టైట్, మరికొందరికి లూజ్, చిన్న పెద్దగా ఇచ్చారు దీంతో విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం యూనిఫాం కుట్టే బాధ్యతను స్థానిక మహిళా సంఘాల సభ్యులకు అప్పగించింది. వారు పాఠశాలకు వెళ్లి విద్యార్థుల కొలతలు తీసుకొని కుట్టారు. ఒక్కో జతకు రూ. 50 చెల్లిస్తామని ప్రభుత్వం అప్పట్లో ప్రకటించగా.. అనంతరం రూ.75 చెల్లిస్తామని ప్రభుత్వం ఒప్పుకుంది. గత ఏడాది కుట్టిన కూలీ రూ.50 తోనే చెల్లించింది ఇంకా జతకు రూ. 25 చెల్లించాల్సి ఉంది. జిల్లాలో సుమారు రూ.45 లక్షలు పాత కుట్టు బకాయిలు చెల్లిస్తేనే కొత్త యూనిఫాం కుడుతామని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అప్పులు తీసుకొని కుట్టే వారికి చార్జీలు చెల్లించామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత బకాయిలు వెంటనే ప్రభుత్వం చెల్లించాలని వారు కోరుతున్నారు.

కొత్త యూనిఫాం కోసం మండలాలకు చేరుతున్న క్లాత్..

పాఠశాలలు ప్రారంభం కాకముందే అన్ని పాఠశాలలకు యూనిఫాంలు చేరే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కో విద్యార్థులకు రెండు జతలు ఇవ్వనున్నారు. జిల్లాలో 49,054 బాలికలు, 45,279 బాలురు మొత్తం 94,333 మంది విద్యార్థులకు యూనిఫాం అందించనున్నారు. జిల్లా కేంద్రం నుంచి యూనిఫాం క్లాత్ మండలాలకు పంపడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సారి కూడా మహిళా సంఘాల సభ్యులకు కుట్టే బాధ్యత అప్పగిస్తున్నారు. పాఠశాలలకు వెళ్లి కొలతలు తీసుకుంటున్నారు ఒక జతకు రూ.75 చెల్లిస్తామని అధికారులు అంటున్నారు. ఒక్కో విద్యార్థికి రెండు జతలు ఇవ్వనున్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు బాలికలకు యూనిఫాం ఒకే విధంగా ఉండేలా మార్పులు చేశారు. 6 నుంచి గురుకులాల ఇంటర్ వరకు బాలుర విదార్థులకు ప్యాంట్లు, షర్టులు ఇవ్వనున్నారు. వీటి పరిశీలన బాధ్యత ఎంఈవోలకు అప్పగించనున్నారు. మే నెలాఖరులోగా యూనిఫాంలు పూర్తి చేసి బడిబాటకు ముందే పాఠశాలలకు చేరేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. తరగతులకు పిల్లలు కొత్త దుస్తుల్లో హాజరయ్యేలా కార్యచరణ రూపొందించినట్లు విద్యా శాఖ అధికారులు తెలిపారు.

ఆత్మీయ పలకరింపులు.. మధుర స్మృతులు



లింగంపేట జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల 2002-03, 2003-04 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



గోపాల్‌పేట జెడ్పీహెచ్ఎస్ 1998-99 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



రామారెడ్డి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 1999-2000 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

- జిల్లాలో పలుచోట్ల సమ్మేళనాలు నిర్వహించిన పూర్వవిద్యార్థులు
- ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో భావోద్వేగానికి గురైన మిత్రులు

లింగంపేట/నిజాంసాగర్/భిక్కనూరు/బీబీపేట/రాజంపేట/నాగిరెడ్డిపేట/రామారెడ్డి: ఆత్మీయ పలకరింపులు.. ఆపాత మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకుని పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. అరే ఎన్నాళ్లయింది కలుసుకుని.. పూర్తిగా మారిపోయావంటూ ఆనాటి స్నేహితులు ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో హర్షం వ్యక్తంచేశారు. జిల్లాలోని వివిధ గ్రామాల ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నానాటి మిత్రులందరూ ఏళ్ల తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలుసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఒకరినొకరు పలకరించుకుంటూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. నాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సమ్మేళనానికి ఆహ్వానించి, సన్మానించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం విద్యార్థులు, గురువులు అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.



రాజంపేట జెడ్పీహెచ్ఎస్ 1987-88 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



బీబీపేటలోని నాగార్జున పాఠశాల 2003-04 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



భిక్కనూరులోని చైతన్య విద్యానికేతన్ పాఠశాల 1999-2000 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



మహమ్మద్ నగర్ జెడ్పీహెచ్ఎస్ 2008-09 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో బల్దియా కార్మికుడికి గాయాలు



నిజామాబాద్ సిటీ: నగర కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్న శంకర్‌కు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. శంకర్ డంపింగ్ యార్డులో శనివారం విధులు ముగించుకొని బైక్‌పై తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఎదురుగా ఓ వ్యక్తి బైక్‌తో వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో శంకర్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన మాక్లూర్ మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన వ్యక్తిని ఐదో టౌన్ పోలీసులకు అప్పగించారు.

రుద్రూర్‌లో వ్యవసాయ కళాశాల కోసం ప్రయత్నాలు

- ఎమ్మెల్యే, ఎంపీకి వినతిపత్రాలు అందజేత



హైదరాబాద్‌లో ఎంపీ సురేశ్‌షెట్కార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైడ్స్ సభ్యులు (ఫైల్)

రుద్రూర్: రుద్రూర్ మండలం అక్బర్‌నగర్ శివారులో వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉమ్మడి జిల్లాకు వ్యవసాయ కళాశాలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర సచివాలయంలో ఫిబ్రవరిలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో నిజామాబాద్ జిల్లా రుద్రూర్‌లో, నల్గొండ జిల్లా కంపసాగర్‌లో వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. దీంతో ఈ ప్రాంత వాసులు, రైతులు వ్యవసాయ కళాశాల కోసం ఎదురు చూస్తున్నారు. ఇక్కడ కళాశాల ఏర్పాటుకు అవసరమగు స్థలం, మౌలిక వసతులు ఉన్నాయి. వ్యవసాయ విద్యాబోధనకు అనుకూలమైన వాతవరణం ఉంది. ఇక్కడ పరిశోధన కేంద్రంతో పాటు కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, ఆహార శాస్త్ర విజ్ఞాన కళాశాలలు ఉన్నాయి. పరిశోధన కేంద్రం ద్వారా వ్యవసాయ పద్ధతలను మెరుగుపరచడం, చీడపీడల నివారణ, వరి, చెరకులో కొత్త వంగడాలను రూపొందించి రైతులకు పరిచయం చేస్తున్నారు. ఇది రాష్ట్ర వ్యవసాయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ సురేశ్ షెట్కార్‌ను ఇటీవల స్వచ్ఛంద సంస్థ రైడ్స్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రాలు అందజేశారు. రుద్రూర్‌లో వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేస్తే ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం ఇచ్చినట్లవుతుందని వారు పేర్కొంటున్నారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం భూములను పరిశీలించడానికి అధికారులను పంపించాలని వ్యవసాయ శాఖ మంత్రిని స్థానికులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని హజ్గుల్ సమీపంలోగల మంజీరా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 10 ట్రాక్టర్లను కందర్‌పల్లి వద్ద ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. వేబిల్లు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం మేరకు తనిఖీలు చేపట్టి పట్టుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



రుద్రూర్: మండల కేంద్రంలోని రాంమందిర్ కాలనీలో ఆదివారం నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గత 15 రోజులుగా పంచాయతీ కుళాయిలు రావడం లేదన్నారు. నీటి కోసం సమీప కాలనీల్లోకి వెళ్తే ఘర్షణ పడుతున్నారని వాపోయారు. మండుటెండలో నీటి కోసం తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై జీపీలో విన్నవిస్తే స్పందన కరువైందన్నారు. ఇకనైనా జీపీ అధికారులు సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

ఖలీల్‌వాడి/ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ శివారులోని బైపాస్ రోడ్డులో గల మల్లారెడ్డి గెస్ట్‌హౌస్‌లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం నిజామాబాద్ సీసీఎస్ పోలీసులు దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం రావడంతో సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు నిజామాబాద్ సీసీఎస్ ఏసీపీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో సీసీఎస్ సీఐ రవికుమార్, సిబ్బంది దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకున్నారు. అలాగే వారి వద్ద నుంచి రూ.21830 నగదును స్వాధీనం చేసుకున్నారు. రూ.2,35,000 ఆన్‌లైన్ చెల్లింపులు యూపీఏల ద్వారా చెల్లించినట్లు గుర్తించి ఫోన్లను సీజ్ చేశారు. అనంతరం ఆర్మూర్ పోలీసులకు అప్పగించారు.

శివాలయంలో చోరీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెంగారం గ్రామంలోని శివాలయంలో దుండగులు చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆలయం తాళాలను దుండగులు శనివారం రాత్రి ఇనుప రాడ్‌తో పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అలాగే ఆలయంలో ఉన్న హుండీని పగుల గొట్టి నగదు, అమ్మవారి మెడలో గల బంగారు పుస్తెను అపహరించారు. ఆలయంలో చోరీ జరగడం ఇది నాలుగోసారి కావడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దొంగతనాల నివారణకు పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నగరంలో ఆపరేషన్ ఛబుత్రా



ఖలీల్‌వాడి: నగరంలోని బర్కత్‌పురా, గాజులపేట్, హయిత్‌గల్లీ, శివాజీనగర్, అహ్మద్‌పురా కాలనీలో ఆదివారం రాత్రి పోలీసులు ఆపరేషన్ ఛబుత్రా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా కాలనీల్లోని ప్రజల వాహనాలకు సంబంధించిన పత్రాలను పోలీసు సిబ్బంది పరిశీలించారు. 36 బైక్‌లు, 6 ఆటోలకు పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. పాత నేరస్తులు, రౌడీషీటర్ల గురించి తెలుసుకున్నారు. ఎవరైనా అనుమానితులు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. పట్టణ సీఐ శ్రీనివాస్ రాజు, ఎస్సైలు యాసీన్ ఆరాఫత్, హన్మండ్లు, ఆర్ఎస్సై అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురి ప్రాణాలు నిలబెట్టిన అవయవదానం



చరణ్‌రాజ్ (ఫైల్)

గాంధారి(ఎల్లారెడ్డి): తాను చనిపోయినా మరో ఐదుగురికి అవయవాలు దానం చేసి ప్రాణాలు నిలబెట్టాడు మండల కేంద్రానికి చెందిన యువకుడు మోచి చరణ్‌రాజ్(30). వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన మోచి రవి, పద్మ దంపతుల చిన్న కుమారుడు చరణ్‌రాజ్ హైదరాబాద్‌లో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 22న జరిగిన రోడ్డు ప్రమాదంలో అతడి తలకు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో అతడు కోలుకోవడం కష్టమని వైద్యులు సూచించడంతో శనివారం చరణ్ తల్లిదండ్రులు, భార్య పెద్ద మనసుతో అతడి అవయవాలు దానం చేసి మరో ఐదుగురి ప్రాణాలు నిలబెట్టారు. అనంతరం అతడి అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామంలో నిర్వహించారు.

విద్యుత్ షాక్‌తో పశువుల మృత్యువాత



మృతి చెందిన ఆవు

సిరికొండ: మండల కేంద్రంలోని చీమన్‌పల్లి రోడ్డులో ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్ షాక్‌తో ఆవు ఆదివారం మృతి చెందింది. సిరికొండకు చెందిన బొందెరి రవికి చెందిన ఆవు తన వ్యవసాయ క్షేత్రానికి సమీపంలో మేత మేస్తోంది. అక్కడే తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆవు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ. 60వేల వరకు ఉంటుందని, నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

పాల్దా గ్రామంలో..



మృతిచెందిన పాడిగేదె

నిజామాబాద్ రూరల్: మండలంలోని పాల్దా గ్రామ చెరువు శివారులో విద్యుదా ఘాతంతో మూడు పాడిగేదెలు మృతిచెందినట్లు పాడిరైతులు ఆదివారం పేర్కొన్నారు. గ్రామానికి చెందిన సంగేశ్ ప్రశాంత్, చాకలి అశోక్‌కు చెందిన పాడిగేదెలు ఊరు బయట చెరువు వద్దకు మేతకు వెళ్లాయి. ప్రమాదవశాత్తు కిందపడిన విద్యుత్‌వైర్ గేదెలకు తగలడంతో కరెంట్‌షాక్‌తో మృతిచెందాయి. ప్రభుత్వం స్పందించి తమకు నష్టపరిహారం అందించాలని బాధిత పాడిరైతులు కోరారు.

అదృశ్యమైన వ్యక్తి.. నాలుగేళ్లకు ఆచూకీ లభ్యం



అజీమ్‌ను తన తమ్ముడికి అప్పగిస్తున్న ఆనం సేవా ఫౌండేషన్ ప్రతినిధులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణానికి చెందిన అబ్దుల్ అజీమ్ నాలుగేళ్ల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయి, ఆదివారం తిరిగి తనవాళ్లకు వద్దకు చేరుకున్నాడు. అనం ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపిన వివరాలు ఇలా.. బోధన్‌కు చెందిన అబ్దుల్ అజీమ్ నాలుగేళ్ల క్రితం మతిస్థిమితం కోల్పోయి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఖమ్మంలోని కారెపల్లిలో తిరుగుతూ ప్రజలపై దాడికి పాల్పడుతుండగా అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి మానసిక పరిస్థితిని గమనించి ఆనం సేవా ఫౌండేషన్‌కు అప్పగించారు. అక్కడ అతడికి వైద్య చికిత్స అందించగా కొద్ది రోజుల నుంచి తన కుటుంబ సభ్యుల వివరాలు వెల్లడిస్తుండంతో ఆదివారం అతడిని బోధన్‌కు తీసుకు వచ్చి ఆచన్‌పల్లిలో నివాసం ఉంటున్న వరుసకు తమ్ముడైన అబ్దుల్ నయీమ్‌కు పోలీసుల సమక్షంలో అప్పగించారు. ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, రావట్ల జనార్ధన్, పద్మాసింగ్, పోలీసులు ఉన్నారు.